
క్లుప్తంగా

వేసవి తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



మరికల్: మండలంలోని వెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహిస్తున్న వేసవి తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. సోమవారం తరగతులను పరిశీలించిన ఆయన విద్యార్థులకు ప్రాథమిక విద్యతో పాటు బోర్డుపై బొమ్మలు వేసి వివరించారు. ఇంకా ఎక్కువ మంది చిన్నారులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థి

దామరగిద్ద: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్‌ఐఎఫ్‌టీ) ప్రవేశ పరీక్షలో మండలంలోని మద్దెల్‌బీడ్‌కు చెందిన హరిచంద్రప్రసాద్ జాతీయ స్థాయిలో 187వ ర్యాంక్ సాధించాడు. తనకు చిన్నప్పటి నుంచి చిత్రాలు గీయడంలో ఆసక్తి ఉందని, జాతీయ స్థాయి ర్యాంక్ రావడం సంతోషంగా ఉందన్నాడు. ఢిల్లీ కాలేజీలో సీటు వచ్చే అవకాశం ఉందని విద్యార్థి తల్లిదండ్రులు కూరగాయల వ్యాపారి లక్ష్మి, తిరుపతి తెలిపారు.

సన్మానం

మరికల్: మండల కేంద్రంలోని యువక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన చలివేంద్రానిలో నెల రోజుల పాటు ఉచితంగా తాగునీరు అందించిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్, రఘు, రాజేష్, రవి, చెన్నయ్య, శేఖర్, రాజు పాల్గొన్నారు.

నేడు వాహనాలు వేలం

నారాయణపేట: స్థానిక ఎక్సైజ్‌శాఖ స్టేషన్ పరిధిలో వివిధ కారణాలతో పట్టుబడి సీజ్‌చేసిన మూడు వాహనాలను మంగళవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు సమక్షంలో వేలం వేస్తున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ నాగేందర్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలచిన వారు ఉదయం 11గంటలలోపు రూ.5వేలు దరవతు రుసుము చెల్లించాలని కోరారు. వేలంలో వాహనాలు దక్కించుకున్న వారు వెంటనే డబ్బు చెల్లించాలని తెలిపారు.

ఈద్గా పనులు ప్రారంభించండి

అమరచింత: పట్టణంలో నూతన ఈద్గా పనులను వెంటనే ప్రారంభించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. ఈద్గా ప్రాంతాన్ని సోమవారం సందర్శించి శిథిలావస్థకు చేరువలో ఉన్న ఈద్గాను తొలగించాలన్నారు. వీటి కోసం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రూ.ఐదు లక్షలు మంజూరు చేశారని, రంజాన్ మాసంలో పనులను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించినా ఇప్పటి వరకు ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఈద్గా నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిప్పు, ఫయాజ్, ఖదీర్ పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారులు గైర్హాజరు

ఆత్మకూర్: మండలంలోని ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ఏర్పాటు చేస్తున్న ప్రజావాణికి అధికారులు గైర్హాజరవుతున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తహసీల్దార్ మినహా అన్ని శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. కాగా డ్రైయినేజీ నిర్మాణం ఆపాలంటూ ఒక ఫిర్యాదు అందిందని, అధికారుల గైర్హాజరు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ సింధూజ అన్నారు.

పకడ్బందీగా గొర్రెల పంపిణీ

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పశువర్ధకశాఖ ఏడీ శ్రీనివాసులు, వెటర్నరీ వైద్యుడు రమేష్ అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లోని శ్రీకృష్ణ గొర్రెల పెంపకందారుల సహకార భవనంలో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవి యాదవ్, డైరెక్టర్ రాజేష్, జేఈఓ నిర్మల, సంఘాల అధ్యక్షులు కురుమూర్తి, చంద్రయ్య, రాజు, గోపాల్‌యాదవ్, రఘు, రమేష్, గొర్రెల పెంపకందారులు ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ

దేవరకద్రరూరల్: పట్టణంలో మూసివేసిన రైల్వే గేట్‌ను తెరిపించాలని కోరుతూ సోమవారం ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైభవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్వోబీ పనులు పూర్తయి అందుబాటులోకి రావడంతో రైల్వే అధికారులు గేట్‌ను మూసివేశారని వివరించారు. దీంతో వాహనదారులకు, పట్టణవాసులకు, వ్యాపారస్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. వెంటనే గేట్‌ను తెరిపించాలని కోరారు.

ఈదురు గాలుల బీభత్సం



ప్రధాన రహదారిపై ..



విద్యుత్ తీగలపై ఒరిగిన చెట్టు

మాగనూర్: మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో ఈదురు గాలి బీభత్సం సృష్టించింది. గ్రామంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగి పడటంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అదే విధంగా గాలి కారణంగా ఎన్‌హెచ్–167పై కొంతసమయం రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. గాలి దుమారంతో చాలా ప్రాంతాల్లో దుమ్ముతో నిండింది. ఒక్కసారిగా వచ్చిన గాలితే గ్రామస్తులు భయందోళన చెందారు.

అంధత్వ నివారణ ప్రభుత్వ లక్ష్యం



కంటి వెలుగు శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మమ్మ

మాగనూర్: అంధత్వ నివారణ ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ లక్ష్మమ్మ అన్నారు. సోమవారం మండలంలోని ఉజ్జెల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కంటి శిబిరం కొనసాగుతోందన్నారు. ప్రతి వ్యక్తికి కంప్యూటరైజ్డ్ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ జైపాల్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ మ్యాకలి నర్సింగప్ప, మాజీ సర్పంచ్ రాజు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వార్డు మెంబర్లు, గ్రామస్తులు, వైద్య సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలన్నింటిని పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీహరి డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపడంతో పాటు ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీఓ ప్రకారం రూ.19,500 వేతనం, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ప్రతినెల మొదటి వారంలోనే వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మన్న, నాగన్న, వెంకటయ్య, బాలకృష్ణ, వెంకటన్న, శ్రీనివాసులు, కార్మికులు ఉన్నారు.పాన్‌గల్: పంచాయతీ కార్మికులకు ఇన్సురెన్స్, ప్రమాదబీమా కల్పించాలని కోరుతూ సోమవారం ఆల్‌ఇండియా ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ప్రమాద బీమా రూ.10 లక్షలు, కార్మికులు చనిపోతే దహన సంస్కారాలకు రూ.30వేలు ఇవ్వాలని, వయస్సు పేరుతో కార్మికులను తొలగించకుండా వారి కుటుంబంలో ఒకరికి అవకాశం కల్పించాలని కోరారు. సంవత్సరానికి మూడు జతల దుస్తులు, చెప్పులు, సబ్బులు, నూనెలకు నగదు రూపంలో అలవెన్స్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుబ్బయ్య, పెంటయ్య, బాలయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

మద్దూరు: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని మద్దూరు ఎస్‌ఐ–2 శ్యాంసుదర్ అన్నారు. సోమవారం మండలంలోని దమ్‌గాన్‌పూర్‌లో ఆదివారం సాయంత్రం పోలీసులు సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, మత్తు పదార్థాలు సేవించడం వల్ల వచ్చే అనర్థాలు తదితర అంశాలపై కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు అధికం అవుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, యువతులు వేధింపులకు గురైతే 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ గోపాల్ రెడ్డి, కళాబృందం సభ్యులు సురేందర్, లింగం, రుఖ్యానాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.



దమ్‌గాన్‌పూర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో కళాజాతా ప్రదర్శన

చంద్రశేఖర్ ఆజాద్ ఆశయాలు సాధిద్దాం

ఊట్కూరు: స్వాతంత్ర్య సమర యోధుడు, విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ ఆశయ సాధనకు పాటుపడాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. మండలంలోని బిజ్వార్‌లో ఆదివారం రాత్రి చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమే నిజమైన దేశభక్తి అని, ఫాసిస్టు మతోన్మాదం వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ 15 ఏళ్ల వయసులో సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేశారు. అతిచిన్న వయస్సులో దేశం కోసం ప్రాణాలు అర్పించిన విప్లవ వీరుడని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తుందని దీంతో నిరుద్యోగం పెరిగిపోతుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఐఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సూర్యం, కృష్ణా, రాము, సలీం, కాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో రిజర్వేషన్ అమలుచేయాలి



శిక్షణలో మాట్లాడుతున్న మధుబాబు

నారాయణపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల్లో వికలాంగులకు ఐదుశాతం రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుబాబు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ ఆలయ ఆవరణలో నిర్వహించిన జిల్లా శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జూన్ 2 నుంచి 22 వరకు అట్టహాసంగా జరపాలని నిర్ణయించడాన్ని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక స్వాగతిస్తుందన్నారు. ప్రభుత్వం అధికారికంగా జరుపుతున్న ఉత్సవాల్లో అన్నివర్గాలు, సామాజిక తరగతులు, ప్రభుత్వ పథకాలపై 21 రకాల కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారన్నారు. కానీ తెలంగాణ రాష్ట్ర జనాభాలో 12శాతం ఉన్న వికలాంగులకు దశాబ్ది ఉత్సవాల్లో స్థానం దక్కలేదన్నారు. ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం పదేళ్లలో ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అదేవిధంగా ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు కె.కాశప్ప మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వికలాంగుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రచారం చేసే వారికి దశాబ్ది ఉత్సవాల్లో వికలాంగులను విస్మరించింది కనిపించడంలేదా అని ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల్లో, ప్రత్యేకంగా ఒకరోజు వికలాంగుల వేడుకలు జరపాలని, పింఛన్ రూ.10వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెంకట్రామరెడ్డి, బాల్‌రాం, ఎన్‌పీఆర్‌డీ పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి బాల్‌రాజ్, మండల అధ్యక్షులు ఖతల్, కార్యదర్శి హన్మంతురెడ్డి పాల్గొన్నారు.

పీఎఫ్‌పై కార్మికులకు అవగాహన

చిన్నచింతకుంట: వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా అధికారి రమేష్ సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కల్పించారు. సందర్భంగా మాట్లాడుతూ బీడీ కార్మికులతో పాటు ఇతరులకు ఏదైన కారణాల వల్ల పీఎఫ్ నిలిచి ఉంటే వాటిని సవరణ చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, పేర్లు తప్పులు ఉంటే సరిచేసుకోవాలన్నారు. అనంతరం కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధికారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి రమేష్

ముందుకు సాగని పనులు

- 4 కి.మీ రహదారి నిర్మాణానికి రూ.3.50 కోట్లు మంజూరు
- ఐదేళ్లు గడుస్తున్నా పనులు చేపట్టని కాంట్రాక్టర్
- కచ్చ రహదారితో రైతుల ఇక్కట్లు

అమరచింత: ఐదేళ్ల కిందట అమరచింత నుంచి మూలమళ్ల వరకు ఉన్న కచ్చ రహదారిని బీటీగా మార్చేందుకు నిధులు మంజూరైనా ఇప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగట్లేదు. 4 కిలో మీటర్ల మేర బీటీ వేయడానికి ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులను చేపట్టకపోవడంతో ప్రజలు, రైతులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమరచింత ఎత్తిపోతల పథకంతో పాటు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ ద్వారా సాగునీరు సమృద్ధిగా లభిస్తుండటంతో ఇరుగ్రామాల రైతులు ఏడాదిలో రెండు పర్యాయాలు వరి పంటను పండిస్తున్నారు. వరిధాన్యాన్ని మార్కెట్‌కు తరలించే యత్నంలో కచ్చ రహదారిపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు పలుమార్లు ప్రమాదానికి గురయ్యాయి. ఈ రహదారిపైనే జూరాల ప్రాజెక్టును సందర్శించే పర్యాటకులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీటీ పనులు వెంటనే చేపట్టాలని పలుమార్లు పీజేపీ అధికారులకు విన్నవించినా.. ఇప్పటికీ పనుల్లో కదలిక లేకపోవడం దారుణమని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. రోడ్డు పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ విషయంలో అధికారులు మౌనంగా ఉండటంతోనే బీటీ రహదారి పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

మండల సమావేశంలో తీర్మానం చేసినా..

అమరచింత, మూలమళ్ల గ్రామాలకు బీటీ పనులు వెంటనే చేపట్టాలని మండల పరిషత్ సాధారణ సమావేశంలో తీర్మానాలు చేయటమే తప్పా.. ఇప్పటి వరకు పనులు చేపట్టలేని పరిస్థితుల్లో అధికారులు కొట్టుమిట్టాడుతున్న పరిస్థితులు దాపరించాయి. పనులు వెంటనే ప్రారంభించాలని, నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదేశించినా.. అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకు రావడంలేదు. పీజేపీ అధికారులు మాత్రం ఇప్పటి వరకు మూడు పర్యాయాలు కాంట్రాక్టర్‌కు నోటీసులు అందించామని చెప్పుకొస్తున్నారే తప్ప పనుల్లో పురోగతి చూపలేక పోతున్నారు. వస్తున్నది వర్షకాలం కావడంతో మళ్లీ పనులు వాయిదా పడినట్లేనని ఇరు గ్రామాల రైతులు వాపోతున్నారు.



అమరచింత నుంచి మూలమళ్లకు వెళ్లే కచ్చ రహదారి

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

దామరగిద్ద: మొగుల్‌మడ్క ఆంజనేయస్వామి ఆలయ ముఖద్వారం ప్రారంభోత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్ మహిపాల్, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో ముఖద్వారాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఎంపీపీ నర్సప్ప, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆశన్న, నర్సిములు, మాజీ సర్పంచ్ సాయిలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

మక్తల్: పట్టణంలో చెరువు కట్ట వద్ద నూతనంగా ఈదమ్మ విగ్రహాలను ప్రతిష్ఠాపన చేస్తున్న సందర్భంగా సోమవారం ఆలయంలో వేదపండితులు హోమం నిర్వహించారు. అనంతరం గోమాతను ఆలయంలోకి ప్రవేశింపజేసి పూజలు చేశారు. రోడ్డు వెడల్పులో ఈదమ్మ దేవాలయం తొలగించడంతో నూతనంగా దేవాలయం నిర్మాణం చేపట్టినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోళ్ళ వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి, శ్యామ్, లక్ష్మన్, శ్రీహరి, మహిపాల్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రవిశంకర్ రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

వైభవంగా లింగమయ్య ఉత్సవాలు



కర్నిల్లో భక్తులతో సందడి

మక్తల్: మండలంలోని కర్నిలో లింగమయ్య ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కృష్ణానది నుంచి పవిత్ర జలాన్ని తీసుకొని వచ్చి స్వామి వారి పుష్కరస్నానం చేయించారు. అనంతరం ఆలయం దగ్గర ప్రత్యేకంగా పూజలు చేశారు. లింగమయ్య దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆలయం దగ్గర చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు.



కర్నిల్లో లింగమయ్యను ఊరేగింపుతో వెళ్తున్న భక్తులు

స్వచ్ఛ మున్సిపాలిటీగా మార్చుకుందాం



అమరచింత: పట్టణాన్ని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుకుందామని, దీనికోసం ప్రజలు సహకరించాలని మెప్మా కోఆర్డినేటర్ యువరాజు అన్నారు. పట్టణంలోని పదో వార్డులో సోమవారం ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమాన్ని ప్రారంభించి కాలనీవాసుల ద్వార పాత వస్తువులు సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ మున్సిపాలిటీయే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అన్ని వార్డుల్లో ప్రతి ఇంట్లో ఉన్న పాత వస్తువులు, కాగితాలు, నోటుపుస్తకాలు, పాత బట్టలు, చెప్పులు, ప్లాస్టిక్ పాడైన వస్తువులను సేకరించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పరిసరాల పరిశుభ్రత వ్యవహారంలో ప్రతి ఒక్కరూ మున్సిపపాలిటీకి సహకరించాలని కోరారు.

వీఓఏల అక్రమ అరెస్ట్ సరికాదు



నారాయణపేటలో..

నారాయణపేట రూరల్ : కనీస వేతన చట్టం అమలు చేయాలనే డిమాండ్‌తో సోమవారం నిర్వహిస్తున్న చలో హైద్రాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకుని వీఓఏలను అక్రమంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించడం సరికాదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమేష్ అన్నారు. పీఎస్ బయట విలేకరులతో మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రయత్నిస్తుంటే ప్రభుత్వం తొక్కివేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, వేతన సవరణ చేసి రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలప్ప, రాజు పాల్గొన్నారు.

దామరగిద్ద: స్థానిక వీఓఏలను పోలీసులు ముందస్తుగా బైండోవర్ చేశారు. సంఘం మండల నాయకులు తుల్జాబాయ్, లక్ష్మణ్, వీరప్ప, నరేష్, సూర్యనారాయణ, రంజిత్, రాజేశ్వరి, మంజుల, రాణి, లీలమ్మ ఉన్నారు.

మద్దూరు: వీఓఏలను ఆదివారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ ఇలాంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. వీరికి రైతు సంఘం నాయకులు అశోక్ మద్దతు పలికారు. అరెస్ట్ అయిన వారిలో వీఓలు బుగ్గప్ప, లక్ష్మణ్‌నాయక్, పురుషోత్తం, గోవిందు, చోటుమియా, కిషన్‌నాయక్, సురేష్, కన్నప్ప, భాస్కర్, నరహరి తదితరులున్నారు.

మక్తల్: సమస్యలను పరిష్కారం కోసం హైదరాబాద్‌లో ఇందిరా పార్కు ఎదుట చేపట్టిన ధర్నాకు తరలివెళ్తున్న వీఓఏలను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుతో విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఆ సంఘం మండల అధ్యక్షుడు బాలయ్య, కార్యదర్శి రాంరెడ్డి, కోశాధికారి జ్యోతి, చంద్రకళ, వెంకట్‌రాములు, బాలయ్య, రాంరెడ్డి, రాజు, రాము, సంతోష, శమంతకమణి, రాధమ్మ, వెంకటేష్, విజయలక్ష్మి ఉన్నారు.

మాగనూర్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు దగ్గర చేపట్టిన ధర్నాకు వీఓఏలు తరలివెళ్లకుండా ఉదయం 5 గంటలకే పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు పూంజనూర్ బాబు మాట్లాడుతూ రూ. 3900 జీతంతో పిల్లలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. విష్ణు, రవి, రమేష్, సూర్యనారాయణ, పురుషోత్తం , పావని, మహేశ్వరమ్మ, బాలు, మారుతి, రఘు తదితరులు ఉన్నారు.

నర్వ: తెలంగాణ ఐకేపీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఇందిరాపార్కు ధర్నాకు తరలివెళ్తున్న వీఓఏలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ వీఓఏల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన చలో ఇందిరాపార్కు ధర్నాకు వెళ్తున్న వీఓఏలను ముందస్తుగా అరెస్టు చేయడం తగదన్నారు. అరెస్టు అయిన వారిలో సంఘం అధ్యక్షుడు సీపురం గోపాల్, ఉపాధ్యక్షుడు జాలిం కుర్మన్న, కార్యదర్శి యాంకి వెంకటేష్, కోశాధికారి వెంకటేశ్వరమ్మ, సంఘం నాయకులు సురేష్, ఆంజనేయులు, మైను, అయ్యన్న తదితరులున్నారు.



మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో వీఓఏలు



మాగనూర్‌లో పోలీస్‌స్టేషన్‌లో వీఓఏలు

ప్రమాదకరంగా మలుపులు

మద్దూరు: మండల కేంద్రం నుంచి నారాయణపేట వెళ్లే రోడ్డులో పెదిరిపాడ్ చెరువు కట్ట దగ్గర ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ నిత్యం వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. పదేళ్ల కిందట ఆర్ అండ్‌బీ నిధులతో బీటీని నిర్మించారు. నారాయణపేటకు వెళ్లేందుకు తక్కువ దూరం కావడంతో వాహనదారులు ఈ దారి గుండా వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ రోడ్డుపై మూలమలుపులు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఎక్కడ ప్రమాద సూచికలు పెట్టకపోవడం, స్పీడ్ బ్రేక్‌లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని నెలల కిందట ఒత్తుగుండ్ల గ్రామానికి చెందిన చాకలి రాములు మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి తీవ్రగాయాలపాలయ్యాడు. అలాగే చెన్నారెడ్డిపల్లికి చెందిన చెంద్రప్ప బైక్ వస్తూ అదుపుతప్పి గాయపడ్డాడు. అధికారులు స్పందించి ప్రమాద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, కల్వర్టు దగ్గర ఇనుప కడ్డీలు, రోడ్డు మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పెదిరిపాడ్ చెరువు కట్ట వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు